క్లుప్తంగా

చికిత్స పొందుతూ బాలుడి మృతి

సీతంపేట: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మూడు నెలల బాలుడు సోమవారం మృతి చెందాడు. సీతంపేట మండలం, బుడ్డడుగూడకు చెందిన గయ్యారమ్మ, భాస్కరరావుల కొడుకు కొన్నిరోజులుగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం రిమ్స్‌కు ఆదివారం తీసుకువెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ తమ బిడ్డ చనిపోయినట్లు బాధిత తల్లిదండ్రులు తెలిపారు.

సన్మానం



శివానంద్‌ను సత్కరిస్తున్న ప్రొఫెసర్ చంద్రదేవ్

పాలకొండ రూరల్: హైదరాబాద్ హిందీ ప్రచారక్ కన్వీనర్‌గా నియమితులైన స్థానిక సీఎల్ నాయుడు విద్యాసంస్థల నిర్వాహకులు చొంగ శివానంద్‌ను హైదరాబాద్‌లో సోమవారం సన్మానించారు. హిందీ భాషకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు హిందీ భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నందుకు గాను ఆయనకు ఈ గౌరవం దక్కినట్లు హిందీ దివస్ హైదరాబాద్ ప్రచార సభ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ తెలిపారు. భవిష్యత్‌లో హిందీ భాషాభివృద్ధికి మరింత పాటుపడతానని సన్మాన గ్రహీత శివానంద్ అన్నారు.

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారు..



నిమ్మక గోపాల్

గుమ్మలక్ష్మీపురం: సూపర్ సిక్స్‌లో అమలు చేయని ఆడబిడ్డ నిధి పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేసేదెప్పుడని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ ప్రశ్నించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వస్తే 18–59 ఏళ్లలోపు మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1500 చొప్పున్న.. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి ఇస్తామని హామీ ఇచ్చారని.. అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా ఆ పథకం ఊసే కూటమి ప్రభుత్వం పట్టకపోవడం శోచనీయమన్నారు. ఈ పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని ప్రభుత్వంలోని ఓ మంత్రి మాట్లాడడం కూడా సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఆడబిడ్డ నిధిని మహిళలకు అందివ్వాలని గోపాల్ డిమాండ్ చేశారు.

అభివృద్ధిని చేతల్లో చూపించాలి



గురుకుల పాఠశాలలో నిలిచిన భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

కురుపాం: కూటమి ప్రభుత్వం మాటల్లో అభివృద్ధి చూపడం కాదని చేతల్లో చూపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇద్దరు విద్యార్థినుల మృతి, సుమారు రెండు వందల మంది విద్యార్థులు ఏక కాలంలో హెపటైటిస్ -ఏ బారిన పడి ఆసుపత్రులలో మృత్యువుతో పోరాటం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా మౌలిక సదుపాయాల కల్పనకు విడుదల చేయలేక పోవడం ఘోరమన్నారు. మొదటిగా గురుకుల పాఠశాలను, ఏకలవ్య పాఠశాలను అక్కడ అందుతున్న సౌకర్యాలను సంబంధిత ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం గిరిజన విద్యకు శాపంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేసి అరకొరగా ఉన్న మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ పరిశీలనలో సీపీఐ సభ్యులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ ఈవో కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిప్యూటీ ఈవో పి.కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని బడ్డుమాసింగి గిరిజన ఆశ్రమ పాఠశాల సహా మరో ఏడు వసతిగృహాలు(హాస్టళ్ల)ను ఆయన సోమవారం సందర్శించి, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు మంచి విద్యనందివ్వడంతో పాటు వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి తెలిపారు. ముఖ్యంగా వారి వసతిగృహాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, పరిశుభ్రమైన తాగునీరు, ఆహారం అందేలా చూడాలన్నారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈవో కురిటి సోంబాబు పాల్గొన్నారు.

● వైద్య సిబ్బంది నిరసన



సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ వైద్య సిబ్బంది నిరసనకు దిగారు. వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి సిబ్బంది విధులకు హాజరయ్యారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గత కొన్నిరోజులుగా ఆందోళనలు చేస్తున్నా కూటమి సర్కారు పట్టించుకోవడం లేదని, ఇకనైనా చర్యలకు ముందుకురాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. -వీరఘట్టం

● చినుకుపడితే చిత్తడే..



చిన్నపాటి వర్షం కురిస్తే చాలు..వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం చిత్తడి చిత్తడిగా మారుతుంది. గతేడాది పీఎంశ్రీ పథకం కింద మంజూరైన రూ.4.25 లక్షలతో మైదానం బాగు చేయగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే మైదానం మళ్లీ అధ్వానంగా తయారైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి, మైదానం బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. -వీరఘట్టం

రైతన్నా.. జాగ్రత్తన్నా!

- పురుగుమందు పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి
- విషపూరిత రసాయనాలతో పొంచి ఉన్న ప్రమాదం
- మోతాదుకు మించి వాడితే పంటకూ నష్టమే..
- అప్రమత్తంగా ఉండకుంటే మనిషికీ ముప్పే..

భామిని:

పంటలో పురుగుమందు పిచికారీ చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజులు, కళ్లకు కళ్లజోడు, తలకు టోపీ, శరీరమంతా కప్పి ఉండేలా ప్యాంట్, షర్టు ధరించాలని సలహా ఇస్తున్నారు. మోతాదుకు మించి చల్లితే పంటకూ ప్రమాదమే..అప్రమత్తంగా ఉండకపోతే మనిషికీ ముప్పేనని చెబుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కొనసాగుతుండగా, పొలాల్లోని పంటలకు పురుగుమందు పిచికారీ చేయడంలో రైతులు నిమగ్నమైన నేపథ్యంలో జాగ్రత్తలపై కథనం..

విత్తనం వేసిన దగ్గర నుంచి..

విత్తనాలు వేసిన దగ్గర నుంచి పురుగుమందు వాడకం సర్వసాధారణమైపోయింది. కలుపుమొక్కల నివారణకు, అధిక దిగుబడులకు రైతులు పురుగుమందుల వాడకానికి ఆసక్తి కనబరుస్తున్నారు. లేకుంటే ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి రాకుంటే తాము అప్పులపాలు కావాలని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే పురుగుమందు పంటకు వేసేటప్పుడు జాగ్రత్తగా ఉంటే ప్రమాదమేమీ ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే పురుగుమందులు పంటకు చల్లడం వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. అధిక మోతాదులో పురుగుమందు పంటలకు వేయడం వల్ల భూసారం తగ్గడంతో పాటు నేలకు మేలు చేసే వానపాములు, రైతుమిత్ర పురుగులు నాశనమవుతాయని హెచ్చరిస్తున్నారు.



పురుగుమందు డబ్బాపై డేంజర్ గుర్తులు..

ప్రతి పురుగుమందు డబ్బాపై డేంజర్(ప్రమాదం) తెలిపే గుర్తులు ఉంటాయి. రైతులు పురుగుమందు కొనుగోలు చేసినప్పుడు డబ్బాపై ఉన్న గుర్తు చూడడంతో పాటు దానిపై రాసి ఉన్న అంశాలను క్షుణ్ణంగా చదివి తెలుసుకోవాలి. చదువుకు రాకుంటే ఎవరితోనైనా చదివి తెలుసుకోవాలి. కొనుగోలు చేసిన పురుగుమందు డబ్బాపై ఎరుపు రంగు త్రిభుజం ఉంటే అది అత్యంత ప్రమాదకరమని గుర్తించాలి. పసుపు రంగు త్రిభుజం ఉంటే అది విషపూరితమని, నీలం రంగు త్రిభుజం ఉంటే కొంచెం విషపూరితమని అర్థం.

పాటించాల్సిన జాగ్రత్తలివే..

- పురుగుమందు పిచికారీ సమయంలో బీడీలు గానీ సిగరెట్లు గానీ తాగరాదు
- చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్లు, ముక్కు, ముఖం తాకరాదు
- భోజనం చేసేటప్పుడు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
- పిచికారీ చేసేటప్పుడు వినియోగించిన దుస్తులను బాగా ఉతుక్కోవాలి
- పురుగుమందు పిచికారీ తర్వాత అస్వస్థతకు లోనైతే వైద్యుడిని సంప్రదించాలి
- పిచికారీ చేసేవారు శరీరమంతా కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి
- పురుగుమందు కలిపిన డబ్బాలు, సీసాలను కాలువలు, చెరువుల్లో వేయవద్దు
- క్రిమిసంహారక మందులను ఉదయం, సాయంత్రం వేళల్లోనే పిచికారీ చేయాలి
- గాలి వీచే దిశకు ఎదురుగా పురుగుమందు పిచికారీ చేయవద్దు
- 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నప్పుడే పిచికారీ చేయడం మంచిది
- పంటకు తడి అందించిన తర్వాత పురుగుమందు పిచికారీ వద్దు ఆ సమయంలో పిచికారీ చేస్తే మందు ఆవిరి అవుతుంది

అప్రమత్తతే రక్ష..



పంటకు పురుగుమందు చల్లేటప్పుడు అప్రమత్తంగా ఉంటేనే రక్షణ. మందు కొనేటప్పుడే అది పంటకు ఏ మేర వినియోగించాలి, ఏ విధంగా పంటకు పిచికారీ చేయాలన్న విషయాలు తెలుసుకోవాలి. డబ్బాపై ఉన్న సూచనలు, హెచ్చరికలు చదివి అర్థం చేసుకోవాలి. పంటకు క్రిమిసంహారక మందులు చల్లేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్త చర్యలను రైతు సేవా కేంద్రాల్లో పోస్టర్లలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. -కె.రాబర్ట్ పాల్, వ్యవసాయ సంచాలకులు, పార్వతీపురం మన్యం జిల్లా

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

వీరఘట్టం: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై సోమవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకోవాలని, ముఖ్యంగా తోటి విద్యార్థులను గౌరవించాలని, బాలికలతో బాలురు గానీ సిబ్బంది గానీ అసభ్యకరంగా ప్రవర్తించకూడదని ఎంఈవో డి.గౌరినాయుడు తెలిపారు. ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడినా, వ్యవహరించినా ఫిర్యాదు చేయవచ్చని బాలికలకు చెప్పారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.పి.నాగమణి, ఐసీడీఎస్ పీవో రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని వెంకంపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 24 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏపీవో చిన్నబాబు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్(ప్రజాసమస్యల పరిష్కార వేదిక)కు 24 వినతులు వచ్చాయి. ఏపీవో జి.చిన్నబాబు వినతులు స్వీకరించి పరిష్కారానికి వాటిని సంబంధిత అధికారులకు అప్పగించారు. నాటుకోళ్ల షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పాతపట్నం మండలంలోని రంకిణికి చెందిన సుశీల, పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో సీటు ఇప్పించాలని మామిడిమానుగూడకు చెందిన ఆరిక ప్రశాంతి, సతివాడ నుంచి జక్కరగూడకు బీటీ రోడ్డు వేయాలని జక్కడగూడకు సవర అడ్డాయి, ఆర్‌వోఎఫ్ఆర్ భూమికి పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని, అటెండర్ పోస్టు ఇప్పించాలని సవరగొయిదికి చెందిన గంగారావు, చేపపిల్లలు పంపిణీ చేయాలని జక్కరగూడ గ్రామస్తులు, వరదగోడ నిర్మించాలని గాదిలంక గ్రామానికి చెందిన జీవన్‌కుమార్, కిరాణా షాపు అభివృద్ధికి రుణం ఇప్పించాలని రేగులగూడకు చెందిన నరేష్ వినతిపత్రాలు సమర్పించారు. నిలిచిపోయిన పింఛన్‌ను పునరుద్ధరించి ఇవ్వాలని సీతంపేట మండలంలోని గడిగుడ్డి గ్రామస్తుడు నిమ్మక అమావాస్య వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈవో రామ్మోహన్‌రావు, పీహెచ్‌వో ఎస్‌పీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: పట్టణంలోని పెద్దకాపు వీధికి చెందిన ఉదయాన సుజాతమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. సుజాతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుమారుడు శివను కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సుజాతమ్మ మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని ఆమె మృతి పట్ల సంతాపం ప్రకటించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు డి.పాపినాయుడు, వై.లిల్లీపుష్పనాథం, వై.మరియదాస్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



పాలకొండ రూరల్: నందెన్న ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెద్దకాపు వీధిలోని నందీశ్వరుని మండపం వద్ద వేదికపై పలువురు చిన్నారులు సోమవారం చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. శ్రీరామపట్టాభిషేకం, శ్రీకృష్ణవిలాపం వంటి పౌరాణిక ఘట్టాలు సహా సామాజిక స్పృహ కలిగించే నాటకాలను నృత్య రూపంలో అభినయించగా వారి ప్రదర్శన ఆద్యంతం చూపరులను ఆకట్టుకుంది.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ



సంతకాలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన లభిస్తోంది. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి.. మండలంలోని వండువ గ్రామంలో కోటి సంతకాల సేకరణ సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వండువ గ్రామస్తులతో పాటు శృంగరాయపురం, పాపంపేట గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని, ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ(పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్) విధానంలో నడుపుతామన్న కూటమి సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంతకాలు చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే నిరుపేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయడమేనని, పేదల ఆరోగ్యం ప్రైవేటుకు తాకట్టు పెట్టడమేనని దీన్ని మనమంతా తీవ్రంగా వ్యతిరేకించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే కళావతి తెలిపారు. కార్యక్రమంలో వండువ గ్రామ సర్పంచ్ మిడితాన కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

వీరఘట్టం: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని స్థానిక బార్నాల వీధి భవన నిర్మాణ కార్మికులంతా ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై వారంతా సోమవారం విలేకరులతో మాట్లాడారు. వర్షాలు, ఇసుక కొరత వల్ల నిర్మాణ పనులు ఆగిపోయాయని, దీంతో ఉపాధి కోల్పోయామన్నారు. తమను ఆర్థికంగా ఆదుకోవాలని, కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి



విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకుల

కురుపాం: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతూ అనారోగ్యం బారిన పడి మృతి చెందిన విద్యార్థులు అంజలి, కల్పన కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్, సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఈ సంఘాల ఆధ్వర్యంలో కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నేతృత్వంలో రావాడ జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే గురుకుల పాఠశాల పరిస్థితి అన్నారు. మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన గిరిజన సంక్షేమాధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లాలో ఉన్న అన్ని గిరిజన సంక్షేమాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం హెచ్‌డీటీ సురేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు సీతారాం, ఎన్‌వై నాయుడు, బీవీ రమణ, బి.అనిల్, కె.అఖిల్, బి.గంగారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

భామిని: రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో సత్తా చాటిన స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులను సిబ్బంది సోమవారం అభినందించారు. రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జి.ఆదిత్య, వి.చందులు ప్రతిభ కనబరచగా జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పీఈటీ శివరామ్‌ప్రసాద్, కోచ్ సోమేష్ తెలిపారు.

ప్రజాహిత కార్యక్రమాలతోనే గుర్తింపు

కురుపాం: ప్రజాహిత కార్యక్రమాలతోనే గుర్తింపు సాధ్యమవుతుందని ఎస్ఐ నారాయణరావు అన్నారు. వాయుపుత్ర సేవా సంఘం తొలి వార్షికోత్సవం సందర్భంగా వారి ఆధ్వర్యంలో రావాడ కూడలిలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద రూ.60 వేల విలువ చేసే రెండు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేశారు. దీనికి హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ ప్రయాణికులు ఇటువంటి డస్ట్‌బిన్లను వినియోగించుకోవాలన్నారు. పంచాయతీ విస్తరణాధికారి సురేష్, ఎల్విన్‌పేట ఎస్ఐ శివప్రసాద్, కళింగ వైద్య సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, వాయుపుత్ర సేవా సంఘం అధ్యక్షుడు గెంబలి ప్రదీప్, బరాటం కిరణ్, బోటు స్వాతి, అనిల్‌కుమార్, జగదీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 15వ తేదీన మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరం వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులంతా ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పాలకొండ: కొత్త కార్యవర్గ సభ్యులు వీరే..

పాలకొండ: స్థానిక పట్టణంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జాతీయ బీసీ కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా గురుబిల్లి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కనపాక ధనుంజయరావు, నియోజకవర్గం అధ్యక్షుడిగా గురుబిల్లి దిలీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శాసపు తిరుపతిరావు ఎన్నికయ్యారు.

ఏపీటీఎఫ్..

వీరఘట్టం: ఏపీటీఎఫ్ వీరఘట్టం మండల శాఖ కొత్త కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు మట్రాపు మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణల ఆధ్వర్యంలో నడుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఏకగ్రీవమైన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా ఎస్.మురళి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.ధనుంజయనాయుడు, మరో 15 మంది సభ్యులుగా ఎంపికయ్యారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఇప్పటికే నాలుగు విడతల్లో సీట్ల భర్తీకి చర్యలు చేపట్టామని, ఇది ఐదో విడత అని పేర్కొన్నారు. సీట్లు కావాల్సిన వారు ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని, సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకుని, ఇదే నెల 17వ తేదీన అడ్మిషన్ కోసం సీతంపేట ఐటీఐకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

● క్షీణిస్తున్న పారిశుధ్యం



పాలకొండ పట్టణంలో పారిశుధ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. గత కొన్నాళ్లుగా చెత్త నిర్వహణపై దృష్టిసారించకపోవడంతో ఎక్కడపడితే అక్కడ కుప్పలుతెప్పలుగా చెత్త దర్శనమిస్తోంది. అది ఎండకు, వానకు కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. అటువైపుగా రాకపోకలు సాగించేవారంతా ఈ దుర్వాసన భరించలేకపోతున్నాం..రోగాలపాలు కాకముందే చెత్త తొలగింపు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. వడమ రోడ్డులో ఉన్న చెత్తను ఈ చిత్రంలో చూడొచ్చు. -పాలకొండ రూరల్

రోడ్డు మరమ్మతుల శాంపిల్స్ సేకరణ



రోడ్డు పనులకు సంబంధించి శాంపిల్స్ సేకరిస్తున్న కాంట్రాక్టర్, సిబ్బంది

భామిని: మండలంలోని గురండి వద్ద ఏబీ రోడ్డు మరమ్మతులకు సంబంధించి శాంపిల్స్‌ను సోమవారం సేకరించారు. అయితే ఈ శాంపిల్స్‌ను క్వాలిటీ కంట్రోలర్ సేకరించాల్సి ఉండగా, ఆయన రాకపోగా రోడ్డు పనుల కాంట్రాక్టరే పనుల నాణ్యత కోసం శాంపిల్స్‌ను సేకరించడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. పని చేయించిన ఆయనే శాంపిల్స్ సేకరిస్తే పనుల నాణ్యత ఎలా తెలుస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, ఎంపీపీఎస్(ప్రభుత్వ) పాఠశాలలకు డీఎస్సీ ఉపాధ్యాయులు 77 మందిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందని మండల విద్యాశాఖ అధికారి బి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మండలానికి కేటాయించిన ఉపాధ్యాయులు స్థానిక ఎంఆర్‌సీ వద్ద ఎంఈవో చేతుల మీదుగా ఆర్డర్స్‌ను అందుకుని ఆయా పాఠశాలల్లో చేరారు.